నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 వరంగల్, బుధవారం 9 ఏప్రిల్ 2025
MULUGU JAYASHANKAR BHUPALPALLY


ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చిన అభ్యర్థులు

# ఫలించిన కేసీఆర్ కృషి..

- కిటెక్స్ వస్త్ర పరిశ్రమలో ఉద్యోగాలకు దరఖాస్తులు
- సుమారు 25 వేల మందికి ఉద్యోగావకాశాలు

గీసుగొండ, ఏప్రిల్ 8: కేసీఆర్ కృషి ఫలించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కిటెక్స్ పరిశ్రమ చైర్మన్, ప్రతినిధులను ఒప్పించి వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని మెగా టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమను ఏర్పాటు చేయించి, వారితో ఎంవోయూ చేసుకుంది. దీంతో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కిటెక్స్ కంపెనీ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతుండడంతో వస్త్ర పరిశ్రమలో మెకానిక్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీర్స్‌తో పాటు వివిధ హోదాల్లో పనిచేయడానికి సిబ్బంది కావాలని కంపెనీ ప్రకటన జారీ చేసింది. దీంతో మంగళవారం వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి నిరుద్యోగులు భారీ సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. వారి అర్హతను బట్టి అర్జీలు స్వీకరించారు. 150 మంది అభ్యర్థులు దరఖాస్తులు పెట్టుకున్నట్లు కంపెనీ ప్రతినిధి మనోజ్‌కుమార్ తెలిపారు. కంపెనీలో ఉద్యోగాల ఖాళీలతో పాటు పూర్తి వివరాలను కిటెక్స్ వస్త్ర పరిశ్రమల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయేలా సభ

**బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం, ఎమ్మెల్సీలు పోచంపల్లి, తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది**


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 8 : బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ మహాసభ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లుతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సభా స్థలిలో ఏర్పాటు చేయనున్న ప్రధాన వేదిక వద్ద చేపట్టాల్సిన పనులపై సూచనలిచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు కడారి రాజు, శ్రీకాంత్‌యాదవ్, చిట్టిగౌడ్ ఉన్నారు.

# భారీగా ప్రజలను సమీకరించాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, ఏప్రిల్ 8 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీగా జనసమీకరణ చేపట్టి విజయవంతం చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. అధినేత కేసీఆర్ నిర్వహించే ఏ సభకైనా ప్రజలు లక్షలాదిగా వస్తారని, వారిని సురక్షితంగా తరలించేందుకు కార్యకర్తలు తోడ్పాటునందించాలన్నారు. మంగళవారం జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలోని వినాయక గార్డెన్‌లో నర్మెట, తరిగొప్పుల మండలాల ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వానకాలం నుంచి రెండు పంటలకు సాగు నీళ్లందుతాయన్నారు. జనగామ ప్రాంత రైతులకు దేవాదుల మొదటి, రెండో దశ నీళ్లు సరిపోవని నాటి సీఎం కేసీఆర్ మూడో దశ పనులు చేపట్టి పూర్తిచేశారన్నారు. దేవాదుల పంపుహౌస్ సిబ్బందికి జీతాలు రాకపోతే తానే ఉన్నతాధికారులతో మాట్లాడి ఇప్పించానన్నారు. మల్లన్నగండి నుంచి బొమ్మకూర్, లద్నూరు, తపాస్‌పల్లి, వెల్దండ, కన్నెబోయిన గూడెం రిజర్వాయర్లకు నీళ్లు వస్తాయన్నారు. ఆలేరు ఎమ్మెల్యే ఆయకట్టు లేని, కాల్వలు లేని దగ్గరికి నీళ్లు తీసుకుపోయేందుకు యత్నిస్తే ఇక్కడి నాయకులు ప్రతిఘటించారని గుర్తు చేశారు. ఇక్కడ ఉన్న అన్ని రిజర్వాయర్లకు నీళ్లు రాకపోతే గులాబీ సైన్యమే కొట్లాడిందన్నారు. మూడేళ్ల తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కేసీఆర్ సారథ్యంలో దేశంలోనే తెలంగాణను మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో నర్మెట, తరిగొప్పుల పార్టీ మండలాధ్యక్షులు చింతకింది సురేశ్, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు తేజావత్ గోవర్ధన్, మాలోత్ శ్రీనివాస్, సుదర్శన్, ముఖ్య నాయకులు గద్దల నర్సింగరావు, పెద్ది రాజిరెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, రామిని శివరాజ్, ఎండీ గౌస్, నీరేటి సుధాకర్, చిలువేరు లింగం, ఏర్పుల ఎబ్నేజర్, మంకెన ఆగిరెడ్డి, నర్ర వెంకటరమణారెడ్డి, పిట్టల రాజు, బావండ్లపల్లి రాజు, గుడికందుల నరహరి, జాల కిషన్, నక్కల రవి తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ నుంచి 10వేల మంది తరలిరావాలి

**మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్, ఏప్రిల్ 8 : ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు డోర్నకల్ నుంచి 10వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యా నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం గొల్లచర్ల క్రాస్ రోడ్డులోని ఫంక్షన్ హల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడానికి అన్నారు. రాష్ట్రాన్ని సాధించిన తర్వాత తాగు, సాగునీరు, విద్య, వైద్య, విద్యుత్ రంగాల్లోని అభివృద్ధి జరిగిందన్నారు. వేలాది తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ ధరంసోత్ బాలూ నాయక్, మహబూబాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షం రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తుమ్మ వెంకట రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాణోత్ పాండు నాయక్ , బోయినపల్లి వెంకన్న, చేరెడి సమ్మి రెడ్డి, పగడాల అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయల వెంకటేశ్వర్లు, మధు, మాన్యు పాట్ని, మాజీ ఎంపీటీసీలు బానోత్ శంకర్ కోటి, మాజీ కో మండల ఆప్షన్ సభ్యుడు లాలు మీయా, పీఏసీఎస్ డైరెక్టర్ తవ్వ వరలక్ష్మి, నాయకులు తాళ్లూరి సతీశ్, రాయల నరేశ్, దేశిని ఉపేందర్, నూకల ఉపేందర్, దేవీశంకర్ పాల్గొన్నారు.

# మంజూరు పత్రాలిచ్చి అనర్హులమంటే ఎట్లా?

**కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించిన ఇందిరమ్మ లబ్ధిదారులు**


కాంగ్రెస్ నాయకులను ప్రశ్నిస్తున్న నామాలపాడు గ్రామస్తులు

బయ్యారం, ఏప్రిల్ 8 : ఇండ్లు మంజూరయ్యాయని పత్రాలు ఇచ్చారు.. ఇప్పుడు అనర్హుల మంటే ఎట్లా..? అంటూ బయ్యారం మండలం నా మాలపాడుకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. నామాలపాడు జీపీని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి 115 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు అందించారు. అయితే అందులో కొందరికే ఇళ్లు కట్టుకోమని అధికారులు చెప్పారు. దీంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ గ్రామానికి వెళ్లగా గిరిజన ప్రజలు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం రాత్రి గ్రామస్తులతో మాట్లాడేందుకు నామాలపాడుకు వెళ్లారు. ఇండ్లు మంజూరు చేశామని అధికారులు పత్రాలు అందరికి ఇచ్చి తీరా కొందరిని మాత్రమే ఇండ్లు కట్టుకోమని అనడం ఏమిటని వారిని ప్రశ్నించారు. పత్రాలు ఇచ్చినప్పుడు అర్హులం అయినప్పుడు.. ఇప్పుడు ఎందుకు కాదని నిలదీశారు. ఇండ్ల విషయంలో కావాలని కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. అర్హులందరికి ఇండ్లు వస్తాయని గ్రామస్తులకు చెప్పి కాంగ్రెస్ నాయకులు అక్కడి నుండి వెనుదిరిగారు.


ములుగురూరల్ : దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి శ్రీకాంత్

రైతన్నపై ప్రకృతి కన్నెర్రచేసింది. చేతికొచ్చే వేళ పంటలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టేసింది. ఈదురుగాలులు, వడగండ్ల ధాటికి కోతకు వచ్చిన వరి గింజలు, మామిడి కాయలు నేలరాలగా, మక్కజొన్న, అరటి చెట్లు నేలవాలి నిండా ముంచింది. రెండు రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో అకాల వర్షం బీభత్సం సృష్టిస్తుండగా సోమవారం రాత్రి, మంగళ వారం ఉదయం మానుకోట, ములుగు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం మిగిల్చి అన్నదాతను ముంచింది. గత ఏడాది వానకాలంలో పెను వరదల ప్రభావం నుంచి ఇంకా కోలుకోని మానుకోట రైతుకు ప్రస్తుత వర్షాలు మరింత అగాథంలో నెట్టేశాయి. జిల్లావ్యాప్తంగా దాదాపు మండలాల్లో పంటలు వర్షార్పణం కావడమే గాక భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు, రేకుల ఇండ్లు దెబ్బ తినడంతో జనజీవనం అతలాకుతలమైంది.

- మహబూబాబాద్/ములుగు, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ)


గోవిందరావుపేట : పస్రాలో నేలరాలిన వరి ధాన్యం

# వర్షార్పణం

## చేతికొచ్చే వేళ పంటలను ఊడ్చేసిన అకాల వర్షం

## వరి, మక్కజొన్న, పెసర, అరటి, మిర్చికి నష్టం

- ప్రకృతి కన్నెర్ర చేయడంతో అన్నదాత ఆగమాగం
- మానుకోట రైతుకు కోలుకోని దెబ్బ
- ఈదురుగాలులకు పలు ప్రాంతాలు అతలాకుతలం
- నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు


ఏటూరునాగారం : మిర్చి కల్లాల్లో చేరిన నీళ్లను కాల్వలు తీస్తూ బయటకు పంపుతున్న రైతులు


మహబూబాబాద్-తొర్రూరు రహదారిపై కూలిన చెట్టు

గతేడాది ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలు మహబూబాబాద్ జిల్లాను అతలాకుతలం చేశాయి. అప్పుడు చెరువులు, చెక్‌డ్యాములు, రోడ్లు కొట్టుకుపోయి, ఇండ్లు ఆగమైన సర్వం కోల్పోయిన ప్రజలు.. ఇంకా ఆ గాయం నుంచి కోలుకోకముందే ప్రకృతి మారోమారు విరుచుకుపడింది. సోమవారం రాత్రి అకాల వర్షం ప్రభావంతో మరిపెడ, సీరోలు మండలాలు మినహా జిల్లాలోని అన్ని మండలాల్లో పంట నష్టం జరిగింది. ఇప్పటికే సాగునీరు లేక రైతులకు సగం పంట ఎండిపోయిన పంటలు.. ఉన్న కొద్దోగొప్పో పంటలైనా తిండి మందం వస్తాయనుకుంటే ఈదురుగాలులు, వడగండ్లకు కొట్టుకుపోయి రైతుల కడుపు కొట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 16 మండలాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 140మంది మామిడి రైతులది 473 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నది. ఇద్దరు రైతులకు సంబంధించిన 5 ఎకరాల బొప్పాయి, మరో ఇద్దరు రైతులకు సంబంధించిన 4ఎకరాల సపోట దెబ్బతిన్నది. జిల్లావ్యాప్తంగా 1,685మంది రైతులకు సంబంధించిన 2,686 ఎకరాల్లో వరి నష్టం జరిగిందని అంచనా వేశారు. 71మంది రైతులకు సంబంధించిన 130 ఎకరాల మక్కజొన్న దెబ్బతిన్నదని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వాస్తవానికి అంతకంటే రెట్టింపు నష్టం జరిగిందని అధికారులు మరికొన్ని రోజులు క్షేత్ర స్థాయిలో సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు. ఈదురుగాలులతో మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి కేసముద్రం వెళ్లే మార్గమధ్యలో ఈదులపూసపల్లి వద్ద చెట్లు కూలడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లాకేంద్రంలోని కంకరబోర్డు వద్ద ఉన్న ఒక ప్రైవేట్ కళాశాల వద్ద విద్యుత్ స్తంభం కూలీపోవడంతో తెల్లవారే వరకు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వం తమకు పూర్తి మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో 86.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 5.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. గంగారం-5.2, మహబూబాబాద్-20.2, నెల్లికుదురు 27.8, చిన్నగూడురు-1.0, మరిపెడ-9.6, తొర్రూరు-6.4, పెద్దవంగర-7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


నెల్లికుదురు : రాజులకొత్తపల్లిలో కురిసిన వడగండ్లు

## 9,110 ఎకరాల్లో పంట నష్టం

ములుగు, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో సోమవారం గాలిదుమారంతో కూడిన అకాల వర్షానికి 9,110 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఈమేరకు మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు వివరాలను వెల్లడించారు. జిల్లాలో ములుగు, గోవిందరావుపేట, మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) మండలాల్లో 4,804 మంది రైతులకు చెందిన 9,110 ఎకరాల్లో ఈ నష్టం వాటిల్లిందని వివరించారు. 2002మంది రైతులకు చెందిన 1860 ఎకరాల వరి పంటకు, నలుగురు రైతులకు చెందిన 10 ఎకరాల మక్కజొన్న, 109మంది రైతులకు చెందిన 148ఎకరాల మామిడి, 29మంది రైతులకు చెందిన 44 ఎకరాల అరటి, ఆరుగురు రైతులకు చెందిన 13ఎకరాల బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదిక రూపొందించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. ప్రతీ రైతుకు వ్యవసాయ శాఖ తరపున నష్టపరిహారం అందించేలా నివేదికను సమర్పించామని పేర్కొన్నారు.


నెల్లికుదురు : నేలవాలిన వరి పంట


గోవిందరావుపేట : సంద్రగూడెంలో ఓ ఇంటిపై నుంచి మరో ఇంటిపై పడిన రేకులు


వెంకటాపూర్ : మండలకేంద్రంలో దెబ్బతిన్న అరటి తోట


తొర్రూరు : హరిపిరాలలో రాలిన మామిడి కాయలు


నర్సింహులపేట : నేలవాలిన మక్కజొన్న


నల్లబెల్లి : మూడుచెక్కలపల్లెలో మాలోత్ బద్రు ఇంటిపై పడిన భారీ చెట్టు

# మూడు రోజుల ముచ్చటేనా !

- వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లో సన్న బియ్యం నో స్టాక్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



తూర్పుకోటలో సన్న బియ్యం స్టాక్ రాలేదని తాళం వేసిన డీలర్

ఖిలావరంగల్, ఏప్రిల్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ నత్తనడకన కొనసాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉగాది పర్వదినం నుంచి సన్న బియ్యం పంపిణీ జరిగితే.. తూర్పు నియోజకవర్గంలోని వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లోని ఈ నెల 5న ప్రారంభించారు. మూడు రోజులు కాక ముందే పలు రేషన్ షాపుల్లో నో స్టాక్ బోర్డు పెట్టేస్తున్నారు. మరికొంత మంది డీలర్లు బియ్యం ఉన్నా ఇచ్చే తీరిక, ఓపిక లేక రేషన్ షాపులను మూసేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఎంతో ఆర్భాటం చేయడంతో పేదలు ఆశగా రేషన్ షాపుల బాట పడుతున్నారు. అయితే, షాపులకు వెళ్లిన లబ్ధిదారులకు సన్న బియ్యం స్టాక్ అయిపోయిందని, దొడ్డు బియ్యం మాత్రమే ఉన్నాయని డీలర్లు చెప్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ మండలంలో 85, ఖిలావరంల్ మండలంలో 72 రేషన్ షాపులకు 8,700 క్వింటాళ్ల చొప్పున బియ్యం ఎనుమాములలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్నారు. ఈ రెండు మండలాలకు ఇంకా 25 శాతం సన్న బియ్యం సరఫరా కావాల్సి ఉందని అధికారులు పేర్కొనడం గమనార్హం.

## అరేయ్.. నువ్వు సీట్లో కూర్చోవద్దు

**లీవ్ పెట్టి వెళ్లిపో.. నా వాళ్లకే పనిచేయవా?**

**ఓ ఇన్‌స్పెక్టర్‌పై అధికార పార్టీ ఎమ్మెల్యే బూతు పురాణం**

సుబేదారి, ఏప్రిల్ 8 : 'అరేయ్.. రేపటి నుంచి నువ్వు సీట్లో కూర్చోవద్దు.. లీవ్ పెట్టి వెళ్ళిపో.. నా వాళ్లకే పనిచేయవా?' అంటూ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఓ ఇన్‌స్పెక్టర్‌ను పరుష పదజాలంతో దూషించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ ఈస్ట్ జోన్ పరిధిలోని ఓ పట్టణంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ను భూ వివాదం విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యే నోటికొచ్చినట్లు బూతులు తిట్టినట్లు తెలిసింది. 'నా వాళ్లకు అనుకూలంగా పనిచేయకుం డా ప్రత్యర్థి వర్గానికి కొమ్ముకాస్తావా? రెండు వర్గాల నుంచి డబ్బులు తీసుకుంటావా? నాకు బాగా పనిచేస్తావని నమ్మి పోస్టింగ్ ఇప్పిస్తే నా మాటనే బేఖాతర్ చేస్తావా? రేపటి నుంచి సీట్లో కూర్చోవద్దు' అని తిడుతూ హుకుం జారీ చేశాడు. దీంతో సదరు ఇన్‌స్పెక్టర్ వారం రోజులు సెలవులో వెళ్లి తిరిగి కొద్ది రోజుల క్రితం డ్యూటీలో చేరాడు. బదిలీ కోసం ఆయన కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రిని కలిసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు సైతం ఒకే సామాజిక వర్గం అని పోస్టింగ్ ఇప్పిస్తే మా మాటే వినడం లేదంటూ సదరు ఇన్‌స్పెక్టర్‌పై మండిపడినట్లు తెలిసింది. ప్రస్తుతం నామ్‌కే వాస్తేగా స్టేషన్‌కు వస్తున్న ఇన్‌స్పెక్టర్ వీలైనంత తొందరగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

# బదిలీలు సరే.. మా బాకీల సంగతేంటి?

- గ్రామాల అభివృద్ధికి లక్షల రూపాయలు అప్పు చేశాం
- బిల్లులు విడుదల కాక నానా అవస్థలు పడుతున్నాం
- అధికారులను ప్రశ్నిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నల్లబెల్లి, ఏప్రిల్ 8: బదిలీలు సరే.. తాము గ్రామాల అభివృద్ధి కోసం వెచ్చించిన బాకీల సంగతేంటని పంచాయతీ కార్యదర్శులు అధికారులు, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు కార్యదర్శుల బృందం మంగళవారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలోని నల్లబెల్లి మండలంలో 29 మంది కార్యదర్శులు, చెన్నారావుపేట 30 మంది, దుగ్గొండి 34, ఖానాపురంలో 21, నెక్కొండలో 39 మంది, నర్సంపేట రూరల్‌లో 19 కలిపి మొత్తం 172 మంది కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 14 నెలలు అవుతున్నది. నాటి నుంచి అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా మంజూరు చేయలేదు. దీంతో కార్యదర్శులు అప్పులు తెచ్చి ప్రధానంగా జీపీ కార్యాలయంలో నెలవారీ స్టేషనరీ, గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్య సమస్యలు పరిష్కరిస్తున్నారు. మేజర్ జీపీలకు రూ. 6 లక్షల నుంచి రూ. 7 లక్షలు, చిన్న జీపీల కార్యదర్శులకు రూ. 2 లక్షల నుంచి రూ. 2.50 లక్షల వరకు రావాల్సి ఉంది. ఈ క్రమంలో బిల్లులు చెల్లించకుండా అకస్మాత్తుగా వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తే తమకు రావాల్సిన బాకీల సంగతేంటని కార్యదర్శులు జిల్లా అధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.


వరంగల్ కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్యదర్శులు